## పొంగిన చెరువు.. మునిగిన పొలాలు



హుజూర్‌నగర్ మండలం బూరుగడ్డలో నీట మునిగిన వరి పొలాలు

హుజూర్‌నగర్ రూరల్, సెప్టెంబర్9 : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు చెరువులు నిండిపోతున్నాయి. అక్కడక్కడ గండ్లు పడుతున్నాయి. హుజూర్‌నగర్ మండలంలోని బూరుగడ్డ గ్రామ చెరువుకు వరద ఉధృతి పెరుగడంతో నీళ్లు కట్ట మీది నుంచి పొంగి పొర్లాయి. దాంతో చెరువు కింద ఉన్న సుమారు 50 ఎకరాల వరి పంట నీట మునిగింది. నష్టపోయిన తమను ఆదుకోవాలని రైతులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.



నల్లగొండ బీఆర్‌ఎస్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల, చిరుమర్తి తదితరులు

# ఐఐహెచ్‌టీ గాయబ్..!

- స్కిల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తామని వెల్లడి
- హైదరాబాద్‌లో తాత్కాలిక భవనంలో అంటూ నమ్మబలికి..
- కనుముక్కలలో విశాల భవనాలు.. ఇక్కడే అంటూ నాడు జీఓ
- ఇప్పుడు మొత్తానికే ప్రఖ్యాత సంస్థ ఎత్తివేతకు కుట్ర
- ఎన్నో ఏండ్లుగా పోరాటాలు, ఆందోళనలతో సాధించుకున్న వైనం
- నేతన్నల ఆశలు, ఆకాంక్షలపై నీళ్లు చల్లిన కాంగ్రెస్
- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న చేనేత కార్మికులు.. ఉద్యమాలకు సిద్ధం

## భూదాన్ పోచంపల్లి నుంచి తరలించుకుపోయిన రేవంత్‌రెడ్డి

'సాంకేతిక నైపుణ్యం, నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని మొన్న జరిగిన శాసనసభలో కొత్త శాసనం చేసినం.. యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని ఫోర్త్ సిటీలో నిర్మించాలని 60 ఎకరాల స్థలాన్ని కేటాయించినం.. దాదాపు 200- 300 కోట్లతో నిధులతో పనులు ప్రారంభించాం. వచ్చే సంవత్సరం నుంచి అక్కడ కళాశాల ప్రారంభించడం ద్వారా అంతర్జాతీయ స్థాయిలో ఐఐహెచ్‌టీకి గుర్తింపు తీసుకురావాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.' ఇవీ హైదరాబాద్‌లో సోమవారం జరిగిన చేనేత సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి అన్న వ్యాఖ్యలు.

– యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 9 (నమస్తే తెలంగాణ)



ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు కేటాయించిన కనుముక్కలలోని హ్యాండ్లూమ్ పార్క్

భూదాన్ పోచంపల్లి నేతన్నల ఆశలు, ఆకాంక్షలపై రాష్ట్ర ప్రభుత్వం నీళ్లు చల్లింది. భూదాన్ పోచంపల్లి మాత్రమే కాదు.. యాదాద్రి భువనగిరి జిల్లా నేత కార్మికుల నోట్లో మట్టి కొట్టింది. ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యాండ్లూమ్ టెక్నాలజీ (ఐఐహెచ్‌టీ)ని తరలించుకుపోయింది. కొన్ని రోజులుగా జరుగుతున్న ప్రచారాన్ని నిజం చేసింది. వచ్చే ఏడాది నుంచి స్కిల్ యూనివర్సిటీలో ప్రారంభిస్తామని స్వయంగా సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. దీంతో భూదాన్ పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు ఫుల్‌స్టాప్ పడింది. ఎన్నో ఏండ్ల పోరాటాలు, ఆందోళనలు, వినతి పత్రాలతో సాధించుకున్న సంస్థను గద్దలా ఎగరేసుకుని పోయారు.

రాష్ట్రంలో నలభై వేల చేనేత కుటుంబాలు ఉండగా, అత్యధికంగా భూదాన్ పోచంపల్లిలోనే నేత కార్మికులు ఉన్నారు. అనాదిగా వస్తున్న సంప్రదాయ పద్ధతులను నమ్ముకొని మగ్గాలపై చీరలు, చేనేత వస్త్రాలు ఉత్పత్తి చేస్తున్నారు. పెద్ద ఎత్తున వస్త్ర వ్యాపారం, తయారీ రంగం ఉంది. ప్రస్తుతం ఐఐహెచ్‌టీల్లో కోర్సులకు మంచి డిమాండ్ ఉంది. తెలంగాణలో ఐఐహెచ్‌టీ లేకపోవడంతో ఇతర రాష్ట్రాలకు తరలివెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ఇది ఆర్థికంగా ఇబ్బంది కావడంతోపాటు, దూరభారం అవుతున్నది. ఇటీవల రాష్ట్రానికి కేంద్రం ఐఐహెచ్‌టీని మంజూరు చేసింది. అయితే రాష్ట్రంలో ఎక్కడ ఏర్పాటు చేయాలనే దానిపై చర్చకు వచ్చినప్పుడు పోచంపల్లి లేదా గద్వాల పేర్లు ప్రస్తావనకు వచ్చాయి. అంతిమంగా భూదాన్‌పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు ఆగస్టు 2న చేనేత, జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజారామయ్యార్ జీఓ నంబర్ 11 విడుదల చేశారు. దీంతో ఇక్కడి నేతన్నల కల సాకారమైందని, ఎన్నో ఏండ్లుగా నేత కార్మికుల చేస్తున్న ఆందోళనలు, విజ్ఞప్తులకు సార్థకత లభించిందని ఎంతో సంబురపడ్డారు.

### కనుముక్కలలో అందుబాటులో విశాల భవనాలు..

భూదాన్ పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ ఏర్పాటుకు ఎన్నో అనుకూలతలు ఉన్నాయి. ఇప్పటికే పోచంపల్లి చేనేతకు ప్రసిద్ధిగాంచింది. ఇక్కత్ వస్త్రాలకు అంతర్జాతీయ గుర్తింపు ఉంది. ఇక మండలంలోని కనుముక్కల పరిధిలో ఉన్న హ్యాండ్లూమ్ పార్క్‌లో భవనాలు అందుబాటులో ఉన్నాయి. ఇది 26 ఎకరాల్లో విస్తరించి ఉంది. దీన్ని గతేడాది రాష్ట్ర ప్రభుత్వం 12.5 కోట్లతో కొనుగోలు చేసింది. ప్రస్తుతం పార్కులోని విశాలమైన భవనాలు నిరుపయోగంగా ఉన్నాయి. వీటిని మరమ్మతులు చేపడితే బ్రహ్మాండంగా ఉపయోగించుకోవచ్చు. అంతేకాకుండా రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌తో పాటు పలు జిల్లా కేంద్రాలకు పోచంపల్లి దగ్గరలో ఉంటుంది. మన దగ్గరే ఐఐహెచ్‌టీ ఏర్పాటైతే చేనేత, జౌళి, డిప్లొమా డిగ్రీ పీజీ కోర్సులతో పాటు పరిశోధనలు, అభివృద్ధి అధ్యయనాలు జరుగుతాయి.

### ఎన్నో ఏండ్లుగా నేతన్నల పోరాటం..

పోచంపల్లిలో ఐఐహెచ్‌టీ కోసం ఎన్నో ఏండ్లుగా పోరాటాలు జరుగుతున్నాయి. పద్మశాలి, నేత కార్మిక సంఘాలు సైతం దీనిపై అనేక విజ్ఞాపనలు చేశాయి. రాష్ట్ర మంత్రులు, కేంద్రానికి వినతులు అందించాయి. ఆందోళనలు, ధర్నాలు, నిరసనలు వ్యక్తం చేశాయి. ఐఐహెచ్‌టీకి ఉన్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో కూడా నెలకొల్పాలని మాజీ మంత్రి కేటీఆర్ అనేక విధాలుగా తన వంతు ప్రయత్నాలు చేశారు. అనేక సార్లు కేంద్ర మంత్రులకు స్వయంగా లేఖలు రాశారు. కానీ పోచంపల్లికి ఐఐహెచ్‌టీ వచ్చినట్లే వచ్చి.. అటే వెళ్లిపోయింది.

### స్కిల్ యూనివర్సిటీకి తరలింపు..!

పోచంపల్లికి ఐఐహెచ్‌టీ మంజూరు కావడంతో ఇక్కడే ప్రారంభించాలి. కానీ సమయాభావం, అత్యవసరం అంటూ తాత్కాలికంగా హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ క్యాంపస్ ఏర్పాటు చేశారు. జీఓలోనూ ఇదే విషయాన్ని స్పష్టంగా పేర్కొన్నారు. కనుముక్కలలో ఏర్పాటుకు కేంద్రం అప్రూవల్ ఇచ్చిందని అందులో చెప్పుకొచ్చారు. దీంతో మొదటి విద్యా సంవత్సరం కోసం పొట్టి శ్రీరాములు యూనివర్సిటీ క్యాంపస్ నుంచే ప్రక్రియ కొనసాగించారు. ఏడాది, రెండేండ్ల తర్వాత పోచంపల్లికి వస్తుందని అంతా భావించారు. కానీ రేవంత్ రెడ్డి మాత్రం బాంబ్ పేల్చే వార్తను చెప్పారు. వచ్చే ఏడాది నుంచి ఫోర్త్ సిటీలోని స్కిల్ యూనివర్సిటీలో ఏర్పాటు చేస్తామని కుండబద్ధలు కొట్టినట్లు స్పష్టం చేశారు. అధికారులు సైతం పోచంపల్లిలోనే ఉండాలని రేవంత్ రెడ్డికి సూచించగా, ఆయన ససేమిరా అన్నట్లు తెలిసింది. అయితే దీన్ని కొడంగల్‌కు తరలించే కుట్ర జరుగుతున్నదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మరోవైపు ఐఐహెచ్‌టీ తరలింపుపై నేత కార్మికులు భగ్గుమంటున్నారు. ప్రభుత్వంపై పోరుకు సిద్ధమవుతున్నారు. పోచంపల్లిలోనే కొనసాగించాలని డిమాండ్ చేస్తున్నారు.

## తెలంగాణ సాహిత్యాన్ని ప్రపంచానికి చాటిన మహనీయుడు కాళోజీ

- ఆయన జీవితం అందరికీ ఆదర్శనీయం
- మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

నీలగిరి, సెప్టెంబర్ 9 : పుట్టుక నీది.. చావు నీది బతుకంతా ప్రజలదని, తెలంగాణ మట్టి మనుషులను తన సాహిత్యం ద్వారా తట్టిలేపిన మహోన్నత వ్యక్తి కాళోజీ నారాయణరావు అని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో సోమవారం కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాహిత్యాన్ని ప్రపంచానికి చాటిన ఆదర్శపాయుడు కాళోజీ అని అన్నారు. తెలంగాణ ప్రాంతంలోని ఎంతోమంది కవులకు స్ఫూర్తినిచ్చిన దార్శనికుడు కాళోజీ అని, ఆయన జీవితం దేశానికే ఆదర్శనీయమని తెలిపారు. తెలంగాణ ఉద్యమం కోసం తన రచనల ద్వారా స్ఫూర్తిని కలిగించారని, యాస, భాష ద్వారా తెలంగాణ జాతిని చైతన్యం చేశారని చెప్పారు. అసమానతలు, అణచివేతలు, ఆధిపత్యాలకు కాళోజీ వ్యతిరేకమన్నారు. ఆయన జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని ప్రజలకు మరింత పారదర్శకంగా సేవలందించాలని సూచించారు. మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య మాట్లాడుతూ తెలంగాణ ప్రజల దీర్ఘకాలిక ఆకాంక్షలు, ఆర్తికి అక్షర రూపం కాళోజీ అని అభివర్ణించారు. నిజాం నిరంకుశత్వానికి వ్యతిరేకంగా కలం ఝుళిపించిన కవితా మూర్తి కాళోజీ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటికం సత్తయ్యగౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్లు చీరా పంకజ్‌యాదవ్, బొర్రా సుధాకర్, ఐసీడీఎస్ మాజీ ఆర్‌ఓ మాలె శరణ్యారెడ్డి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అభిమన్యు శ్రీనివాస్, కంచనపల్లి రవీందర్‌రావు, మాజీ ఎంపీపీ కరీంపాషా, బీఆర్‌ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, పార్టీ మండలాధ్యక్షుడు దేప వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్ మారగోని గణేశ్, కోఆప్షన్ సభ్యులు కొండూరు సత్యానారాయణ, జమాల్‌ఖాద్రి, గున్‌రెడ్డి యుగేంధర్‌రెడ్డి, పల్లె రంజిత్, నాయకులు రావుల శ్రీనివాస్‌రెడ్డి, తీగల జాన్‌శాస్త్రి, సయ్యద్ జాఫర్, సుంకిరెడ్డి వెంకట్‌రెడ్డి, వీరమల్ల భాస్కర్, కందుల లక్ష్మయ్య పాల్గొన్నారు.



అనంతగిరి మండలం గోండ్రియాలలో వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

## వరద బాధితులకు నష్ట పరిహారం అందే వరకు పోరాటం

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

అనంతగిరి, సెప్టెంబర్ 9 : వరద బాధిత కుటుంబాలకు నష్ట పరిహారం అందే వరకు పోరాడతామని మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ అన్నారు. అనంతగిరి మండలంలోని గోండ్రియాల, కొత్తగూడెం గ్రామాల్లో సోమవారం ఆయన వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించారు. వారం రోజుల వ్యవధిలో మండలంలో రెండోసారి పర్యటించారు. పాలేరు నది అవతల ఉన్న ఆవాస గ్రామం రంగాపురం కారులో వెళ్లేందుకు వీలు లేకపోవడంతో స్థానిక రైతు ట్రాక్టర్‌పై వెళ్లి అక్కడి బాధితులతో మాట్లాడారు. పాలేరు నది కోతకు గురైన పరిసరాలను పరిశీలించి, అక్కడ ఉన్న రైతులు, గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులు వరద నష్టాన్ని వివరించారు. అనంతరం బొల్లం మల్లయ్య మాట్లాడుతూ పాలేరు నది గ్రామాన్ని ముంచెత్తి నివాసాలకు, రైతులకు అపార నష్టం కలిగించిందన్నారు. వరదలలో నష్ట పోయిన ప్రతి ఒక్కరికీ పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ శ్రేణులు బాధితులకు నష్ట పరిహారం అందేలా చూడాలని సూచించారు. ఆయన వెంట బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు నల్ల భూపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌నాయక్, పార్టీ నాయకులు సంతోష్, సత్యనారాయణ, ఏడుకొండలు, సైదులు, భిక్షం, బోసు, పూర్ణచందర్‌రావు, హరీశ్, నాగయ్య, వెంకటయ్య ఉన్నారు.

## ప్రత్యేక అధికారులు అప్రమత్తంగా ఉండాలి

- నల్లగొండ కలెక్టర్ నారాయణరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

నల్లగొండ, సెప్టెంబర్ 9 : ప్రత్యేక అధికారులు రానున్న మూడు నెలలపాటు గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ నారాయణ రెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన జిల్లా అధికారుల సమ్మిళిత సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పంచాయతీల్లో చిన్న చిన్న పనులు చేపట్టేందుకు అడ్వాన్స్‌లు తీసుకునే సౌకర్యం కల్పించాలని ప్రత్యేక అధికారులకు సూచించారు. ప్రతి మంగళవారం ఒక గ్రామాన్ని సందర్శించి, తాగునీటి సమస్యలు, సీజనల్ వ్యాధులు, ఇతర సమస్యలపై ఆరా తీసి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరించాలని, ప్రభుత్వ స్థలాలను గుర్తించి సిద్ధంగా ఉంచాలని అన్నారు. మున్సిపాలిటీల్లోనూ కమిషనర్లు స్థానికంగా నెలకొన్న సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గాల్లో పాఠశాలలు, ఆస్పత్రుల కోసం నియమించిన అధికారులు ఆయా అంశాలపై నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు పూర్ణచంద్ర, శ్రీనివాస్, డీఎఫ్‌ఓ రాజశేఖర్, స్పెషల్ కలెక్టర్ నటరాజ్, డీఆర్‌ఓ రాజ్యలక్ష్మి, డీఆర్డీఓ శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్‌బాల్ బాలుర జట్టుతో అధికారులు

## హ్యాండ్ బాల్ ఉమ్మడి జిల్లా జట్టు ఎంపిక

నకిరేకల్, సెప్టెంబర్ 9 : ఉమ్మడి నల్లగొండ జిల్లా హ్యాండ్ బాల్ సబ్ జూనియర్స్ బాలుర జట్టును సోమవారం నకిరేకల్ మండలంలోని మంగళపల్లి హైస్కూల్ గ్రౌండ్‌లో ఎంపిక చేసినట్లు హ్యాండ్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతకాయల పుల్లయ్య తెలిపారు. ఎంపిక పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి 80 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, వీరిలో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన వారిని ఎంపిక చేసినట్లు తెలిపారు. జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 14 నుంచి 16 వరకూ వరంగల్ జిల్లా కేంద్రంలోని జేఎన్‌ఎస్ స్టేడియంలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల నోడల్ అధికారి కర్ర వీరారెడ్డి, హ్యాండ్ బాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎండీ ఉస్మాన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## వినాయక నిమజ్జన స్థలం మార్పు

మిర్యాలగూడ, సెప్టెంబర్ 9: భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని వినాయక విగ్రహాల నిమజ్జన స్థలాన్ని మార్చినట్లు సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిమజ్జన స్థలాన్ని పైలాన్ కాలనీ కొత్త బ్రిడ్జి నుంచి కాకుండా సమ్మక్క సారక్క పుష్కరఘాట్‌కు మార్చినట్లు పేర్కొన్నారు. దాంతో పాటు వాడపల్లి పాత బ్రిడ్జి పైనుంచి, 14వ మైలు రాయి అలీనగర్ వద్ద విగ్రహాలను నిమజ్జనం చేసుకోవాలని సూచించారు. భక్తులు పోలీసు, రెవెన్యూ అధికారుల సూచనలు పాటించి నిమజ్జనాన్ని ప్రశాంత వాతావరణంలో చేయాలని కోరారు.

## వరద ముంపు ప్రాంతాల్లో పునరుద్ధరణ పనులు చేపట్టాలి



ప్రజావాణిలో దరఖాస్తులను స్వీకరిస్తున్న కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

- క్షేత్రస్థాయిలో జిల్లా అధికారులు పర్యటించాలి
- హాస్టళ్లు, రెసిడెన్షియల్ పాఠశాలలను సందర్శించాలి
- కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

సూర్యాపేట, సెప్టెంబర్ 9 : వరద ముంపు ప్రభావిత ప్రాంతాల్లో జిల్లా అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు చేసి పునరుద్ధరణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఆయన ప్రజావాణి నిర్వహించారు. ప్రజల నుంచి 84 దరఖాస్తులను స్వీకరించి వాటిని ఆయా శాఖల అధికారులకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో భారీ వర్షాలు నమోదయ్యాయని, అధికారులు ప్రమత్తంగా ఉండడంతో పెను ప్రమాదం తప్పిందన్నారు. వరదల వల్ల తెగిపోయిన కాల్వ, చెరువు కట్టలు, దెబ్బతిన్న రోడ్లు, కరెంట్ స్తంభాలు, ట్రాన్స్ ఫార్మర్లలకు మరమ్మతులు చేయాలని తెలిపారు. మునిగిపోయిన పంట పొలాలు, చనిపోయిన పశువులు, కూలిన ఇండ్ల వివరాలతో నివేదికలు తయారు చేసి అందించాలని చెప్పారు. ఈ నివేదికల ఆధారంగా ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందని తెలిపారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు కేటాయించిన ప్రత్యేక అధికారులు వాటిని సందర్శించి విద్యార్థులకు సీజనల్ వ్యాధులు రాకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జాతీయ స్థాయిలో అందించే 9 రకాల పంచాయతీ రాజ్ అవార్డులకు 9 గ్రామ పంచాయతీలు దరఖాస్తులు చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ బీఎస్ లత, జడ్పీసీఈఓ అప్పారావు, డీఎఫ్‌ఓ సతీష్‌కుమార్ పాల్గొన్నారు.

## 20 మండలాల్లో అధిక వర్షపాతం

- సూర్యాపేట జిల్లాలో 29.11 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదు
- తిరుమలగిరి, నేరేడుచర్లలో సాధారణం.. పాలకవీడులో లోటు వర్షపాతం

సూర్యాపేట, సెప్టెంబర్ 9 : సూర్యాపేట జిల్లాలో భారీగా వర్షపాతం నమోదవుతున్నది. సెప్టెంబర్‌లో తొమ్మి రోజులు జిల్లాలో అత్యధిక వర్షాలు కురిశాయి. 38.9 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా 648 శాతం అధికంగా నమోదైంది. 291.1 మిల్లీమీటర్ల సగటు వర్ష వర్షపాతం కురిసింది. జిల్లాలో 20 మండలాల్లో అధిక వర్షపాతం, తిరుమలగిరి, నేరేడుచర్ల మండలాల్లో సాధారణ, పాలకవీడు మండలం లోటు వర్షపాతం నమోదైనట్లు అధికారులు గుర్తించారు. జూన్ నుంచి వర్షాలు ప్రారంభం కాగా ఆ నెలలో 52 శాతం వర్షాలు కురిశాయి. కానీ జూలై, ఆగస్టులో లోటు వర్షపాతం నమోదు కావడంతో వేసవిని తలపించే ఎండలు నమోదయ్యాయి. సెప్టెంబర్‌లో కురుస్తున్న వర్షాలతో జిల్లా తడిసి ముద్దవుతున్నది.

### 7 రోజుల్లో 291.1 మిల్లీమీటర్ల వర్షపాతం

సెప్టెంబర్‌లో 9 వరకు 7 రోజులపాటు కురిసిన వర్షం రికార్డు స్థాయిలో నమోదైంది. 291.1 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. సాధారణంగా సెప్టెంబర్‌లో 9 రోజుల్లో 38.9 మిల్లీమీటర్ల వర్షపాతం ఉండాలి కానీ 648 శాతం అధికంగా నమోదయ్యాయి. అత్యధికంగా మోతె మండలంలో 123 శాతం, 7 మండలాల్లో 80 శాతం అధిక వర్షపాతం నమోదైంది. సాధారణం గా 2024–25లో జూన్ 1 నుంచి మే 30వరకు సగటున 784.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని అధికారుల అంచనా. కానీ ఈఏడాది సెప్టెంబర్ నాటికే 754.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. 2023–24లో 714.1 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా గతానికి మించి ఈ ఏడాది వర్షాలు కురిశాయి.

### పెరిగిన భూగర్భ జలాలు

భారీ వర్షాలకు భూగర్భ జలాలు భారీగా పెరిగాయి. భూగర్భ గనుల శాఖ ఆగస్టు చివరలో తీసిన లెక్కల ప్రకారం 6.15 మీటర్ల లోతులోనే జలాలు ఉన్నట్లు గుర్తించారు. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు భూగర్భ జలాలు ఇంకా పైకి వచ్చే అవకాశం ఉన్నది. ఈ నెల చివరి వారంలో తీసే లెక్కల ప్రకారం ఏ స్థాయిలో పెరిగాయో తెలుస్తుంది. ఇప్పటికే చెరువులు 95 శాతం అలుగులు పోస్తున్నాయి.



అలుగు పోస్తున్న మోతె మండలంలోని సిరికొండ నాగుల చెరువు

**జిల్లాలో నెలల వారీగా నమోదైన వర్షపాతం వివరాలు (మిల్లీమీటర్లలో)**

| నెల | సాధారణ వర్షపాతం | నమోదైన వర్షపాతం |
|---|---|---|
| జూన్ | 96.1 | 146.5 |
| జూలై | 178.8 | 155.4 |
| ఆగస్టు | 176.1 | 161 |
| సెప్టెంబర్ 9 వరకు | 154.7 | 291.1 |

**మండలాల వారీగా జూన్ 1 నుంచి సెప్టెబర్ 9 వరకు నమోదైన వర్షపాతం (మిల్లీ మీటర్లు)**

| మండలం | సాధారణ వర్షపాతం | నమోదైన వర్షపాతం | శాతం | స్టేటస్ |
|---|---|---|---|---|
| నాగారం | 538.4 | 745.8 | 39 | అధిక వర్షపాతం |
| తిరుమలగిరి | 568.9 | 626.4 | 10 | సాధారణం |
| తుంగతుర్తి | 537.9 | 729.3 | 36 | అధికం |
| మద్దిరాల | 510.4 | 919.0 | 80 | అధికం |
| నూతనకల్ | 495.7 | 790.5 | 59 | అధికం |
| జాజిరెడ్డిగూడెం | 537.1 | 772.5 | 44 | అధికం |
| సూర్యాపేట | 525.3 | 837.9 | 60 | అధికం |
| ఆత్మకూర్(ఎస్) | 466.4 | 861.1 | 85 | అధికం |
| మోతె | 398.8 | 888.4 | 123 | అధికం |
| చివ్వేంల | 465.5 | 728.2 | 56 | అధికం |
| పెన్‌పహాడ్ | 479.5 | 594.2 | 24 | అధికం |
| మునగాల | 516.7 | 946.6 | 83 | అధికం |
| నడిగూడెం | 492.7 | 829.2 | 68 | అధికం |
| అనంతగిరి | 497.0 | 877.0 | 76 | అధికం |
| కోదాడ | 524.2 | 951.1 | 81 | అధికం |
| చిలుకూరు | 483.2 | 924.9 | 91 | అధికం |
| గరిడేపల్లి | 459.8 | 577.4 | 26 | అధికం |
| నేరేడుచర్ల | 469.4 | 478.8 | 2 | సాధారణం |
| పాలకవీడు | 483.0 | 381.1 | -21 | లోటు వర్షపాతం |
| మఠంపల్లి | 382.3 | 695.2 | 82 | అధికం |
| హుజూర్‌నగర్ | 492.2 | 805.3 | 64 | అధికం |
| మేళ్లచెర్వు | 477.6 | 783.5 | 64 | అధికం |
| చింతలపాలెం | 465.3 | 608.6 | 31 | అధికం |